సాక్షి
వనపర్తి
సోమవారం | 24 | జూలై | 2023



గుదిబండలా 'వాటర్ గ్రిడ్'

అయిజలో పెద్దవాగుపై ఉన్న వాటర్‌గ్రిడ్ పైప్ లైన్ అధికారుల నిర్లక్ష్యంతో కుప్పకూలింది.

వివరాలు 8లో ▸



జూరాలకు వరద

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 31,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.6 /22.4

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ డీఎం



వేణుగోపాల్

వనపర్తిటౌన్: వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వేణుగోపాల్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం ప్లానింగ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న వేణుగోపాల్ బదిలీపై ఇక్కడి రాగా.. ఇక్కడ డీఎంగా విధులు నిర్వర్తించిన పరమేశ్వరి ప్లానింగ్ సెక్షన్‌కు బదిలీపై వెళ్లారు.

డీఎం వీడ్కోలు సభ..



డీఎంగా పనిచేసిన పరమేశ్వరి వీడ్కోలు సభ ఆదివారం డిపోలో నిర్వహించారు. పరమేశ్వరి, శ్రీధర్ దంపతులను అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో పాటు ఐజేయూ జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్, మహిళా ఉద్యోగుల సంఘం కన్వీనర్ చెన్నపద్మ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. పరమేశ్వరి ఉన్నతాధికారినని దురుసుగా ప్రవర్తించకుండా క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, కార్మికుల వెంట ఉంటూ సంస్థ అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. నష్టాల్లో ఉన్న డిపోను లాభాల బాటలో నడిపించేందుకు అన్నిరకాల అవకాశాలు, ప్రణాళికలను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన డీఎం వేణుగోపాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ చంద్రమౌళి, మెకానికల్ ఇంజినీర్ యాదయ్య, ఉద్యోగులు డీఆర్ గౌడ్, వీవీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేజీబీవీ సీఆర్టీ పోస్టులకు పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ, పీజీసీఆర్టీ, స్పెషల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నేటి నుంచి పరీక్షలు నిర్వహించనుంది. ఉమ్మడి జిల్లా పరీక్షకేంద్రాలుగా జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయం, జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. సోమవారం సోషల్ సబ్జెక్టు, ఈ నెల చివరి వరకు వివిధ సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించున్నారు. పరీక్షలను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించనున్నారు. ఫాతిమా విద్యాలయంలో 589, జేపీఎన్‌సీలో 981 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



వనపర్తిటౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్‌ను అమలు చేయాలని తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనకు చేపట్టే ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కరపత్రాలను తపస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో విడుదల చేసి మాట్లాడారు. సోమవారం జిల్లాలోని ఉపాధ్యాయులందరి సంతకాలతో గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ-మెయిల్ ద్వారా విన్నవించనున్నామన్నారు. మంగళవారం మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి వినతిపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 31న నియోజకవర్గాల వారీగా ఆర్డీఓకు వినతిపత్రాలు, ఆగస్టు 5న తపస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మహాధర్నా, అదే నెల 19న రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్‌లో మహాధర్నా ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, నాయకులు కృష్ణ, శివర్ధన్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

బీచుపల్లి ఆలయంలో న్యాయమూర్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి సంధ్యారాణి శ్రీహరి దంపతులు, గద్వాల జిల్లా జడ్జి కుశ దంపతులు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ సాంప్రదాయం ప్రకారం సిబ్బంది పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు మారుతిచారి వారిని శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టతను గురించి వివరించారు.

మెరిసిన మీనం



జిల్లాలో ఏటా పెరుగుతున్న మత్స్యసంపద



కొత్తకోట మండలం రాణిపేట చెరువులో పెరిగిన చేపలు (ఫైల్)

- ఈ ఏడాది 16,384 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి
- 2022-23లో 2.24 కోట్ల ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రణాళిక

వనపర్తి: తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలులోకి వచ్చిన నీలి విప్లవం పథకంతో జిల్లాలో మత్స్యసంపద రికార్డుస్థాయికి చేరింది. ఈ పథకంతో మత్స్యకారుల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నిండినట్లు చెప్పుకోవచ్చు. ఇందుకు ఏటా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో ఉచిత చేప పిల్లల పంపిణీతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడమే ప్రధాన కారణం. పథకం ప్రారంభం నుంచి జిల్లాలో ఏటా మత్స్యసంపద వృద్ధిరేటు గణనీయంగా పెరుగుతోందని మత్స్యశాఖ గణాంకాలతో స్పష్టమవుతోంది. తాజాగా ఈ ఏడాది జిల్లా మత్స్యసంపద 16,384 మెట్రిక్ టన్నులకు పెరగటం ఉదాహరణగా చెప్పువచ్చు. పెబ్బేరు మండలం శాఖాపూర్ చెరువు, కొత్తకోట మండలం రాణిపేట చెరువు, పాన్‌గల్, వనపర్తిలోని ఈదుల చెరువులో ఒక్కో చేప అయిదు నుంచి పది కిలోల బరువు పెరిగినట్లు మత్స్యకారులు ఇటీవల దశాబ్ది ఉత్సవాల్లో చెరువుల పండుగ సందర్భంగా ప్రదర్శించిన చేపలతో వెల్లడవుతోంది.

జిల్లాలో 118 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు..

జిల్లావ్యాప్తంగా 118 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా.. అందులో 104 పురుష సంఘాలు, 12 మహిళా మత్స్యకారుల సంఘాలు, రెండు మార్కెటింగ్ సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో 11,318 మంది మత్స్యకార కుటుంబాల నుంచి సభ్యత్వాలున్నాయి. అలాగే జిల్లాలో 1,254 చెరువులు, కుంటలు ఉండగా.. వాటితో పాటు శ్రీశైలం బ్యాక్‌వాటర్, జూరాల జలాశయాల్లో ఏటా చేప పిల్లలు వదులుతున్నారు.

పీఎంఎంఎస్‌వై పథకంతో 41 చెరువుల ఏర్పాటు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా పెబ్బేరు, వనపర్తి, ఆత్మకూరు మండలాల పరిధిలో 41 చెరువులను చేపల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటిలో చేప పిల్లలు, చేపల పెంపకం చేపడుతున్నారు.

నీటిమట్టం పెరిగితేనే..



ఈ ఏడాది వర్షాల రాక ఆలస్యం కావడంతో చెరువుల్లో ఆశించిన మేర నీరు లేకపోవడంతో చేప పిల్లల పంపిణీలో జాప్యం జరిగింది. ప్రతి చెరువులో 80 శాతం మేర నీరు రాగానే చేప పిల్లలు వదులుతాం. జిల్లాలో మత్స్యసంపద ఏటా పెరుగుతోంది. నీలి విప్లవం పథకం అమలులోకి వచ్చిన తర్వాత మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించారు. మార్కెటింగ్‌లోనూ పూర్తిస్థాయిలో ప్రోత్సాహకం అందిస్తున్నాం.

– రహమాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి

2.24 కోట్ల చేప పిల్లల పంపిణీ..

వానాకాలంలో జిల్లావ్యాప్తంగా 80 శాతం నీరున్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, శ్రీశైలం బ్యాక్‌వాటర్, జూరాల ప్రాజెక్టులో 2.24 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు మత్స్యశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. వర్షాల రాక ఆలస్యం కావడంతో చెరువుల్లో నీటిశాతం ఆశించిన మేర లేక ఈ ఏడాది చేప పిల్లలు వదలడం ఆలస్యమైందని చెప్పవచ్చు. చేప పిల్లలు సరఫరా చేసేందుకు నేటికీ ఆయా ప్రాంతాల కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించలేదు. చెరువుల క్షేత్రస్థాయి పరిశీలన దశలోనే టెండర్ల ప్రక్రియ ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీటిశాతం పెరిగితే.. చేప పిల్లలు వదిలేందుకు అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు.

జిల్లాలో ఏటా మత్స్యసంపద ఇలా..

ఆర్థిక సంవత్సరం	చెరువులు	వదిలిన చేప పిల్లలు (కోట్లలో..)	చేపల ఉత్పత్తి (మె.టన్నుల్లో..)
2019-20	400	1.49	12,117
2020-21	658	2.02	12,186
2021-22	1,084	2.35	16,332
2022-23	-	2.24	16,384



కొత్తకోట మండలం కానాయపల్లి చెరువులో చేప పిల్లలు వదులుతున్న మంత్రులు తలసాని, నిరంజన్‌రెడ్డి (ఫైల్)

ఎత్తిపోతలకు సిద్ధం

వరద పెరిగితే కేఎల్ఐ మోటార్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి




కల్వకుర్తి ఎత్తిపోతల పథకం

- ఎల్లూరు పంప్‌హౌజ్‌లో మూడు మోటార్లే అందుబాటులో..
- మరో రెండు మోటార్ల మరమ్మతుకు అడ్డంకులు
- వారం రోజుల్లో ఎత్తిపోతలు ప్రారంభమయ్యే అవకాశం

కొల్లాపూర్: రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడిప్పుడే వానలు సమృద్ధిగా కురుస్తున్నాయి. తెలంగాణకు జీవధార అయిన కృష్ణానదికి రెండు రోజుల క్రితమే వరద ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కర్ణాటక, మహా రాష్ట్రాల్లో భారీవర్షాలు కురుస్తుండడంతో వారం రోజుల్లో పెద్ద ఎత్తున వరద వచ్చే అవకాశాలు ఉండటంతో నీటి పారుదలశాఖ అధికారులు అప్రమత్తమవుతున్నారు. కృష్ణానదికి అనుసంధానంగా ఉన్న కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా వరద నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

మూడు మోటార్లతోనే..

కేఎల్ఐలోని ఎల్లూరు పంప్‌హౌజ్‌లో ఐదు మోటార్లు ఉన్నాయి. వీటిలో ఒకటి స్పేర్‌లో ఉంచి మిగతా నాలుగింటితో ఎత్తిపోతలు కొనసాగించేలా ప్రాజెక్టు నిర్మించారు. అయితే ఐదింటిలో రెండు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో మిగిలిన 3 మోటార్లతోనే ఈ ఏడాది సాగునీటి ఎత్తిపోతలు చేపట్టనున్నారు. అయితే కృష్ణానదికి ఈ నెలాఖరులోగా వరద జలాల తాకిడి ప్రారంభమవుతుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో పంప్‌హౌజ్‌లోని మోటార్ల మరమ్మతు పనులను నిలిపివేశారు. నదికి వరద ప్రవాహం మొదలైతే వెంటనే ఎత్తిపోతలు చేపట్టేలా అన్ని చర్యలు తీసుకున్నారు. నీటిపారుదల శాఖ సీఈ, ఎస్ఈల పర్యవేక్షణలో ఎత్తిపోతలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎల్లూరు పంపుహౌజ్‌లో మోటార్లు

రోజుకు 0.18 టీఎంసీలు..

ఎల్లూరు పంప్‌హౌజ్‌లోని ఒక్కో మోటార్ ద్వారా రోజూ 0.06 టీఎంసీ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంది. ప్రస్తుతం పంప్‌హౌజ్‌లో ఉన్న మూడు మోటార్ల సహాయంతో నీటిని ఎత్తిపోస్తే రోజూ 0.18 టీఎంసీ నీళ్లను తరలించవచ్చు. అయితే ఒక మోటార్‌ను స్పేర్‌లో ఉంచి.. రెండు మోటార్లతోనే పంపింగ్ చేపడితే మాత్రం రోజూ 0.12 టీఎంసీ నీటిని మాత్రమే ఎత్తిపోసే అవకాశం ఉంది. ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 0.36 టీఎంసీలు. అక్కడి నుంచి సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లకు రెగ్యులర్‌గా నీటిని తరలించి సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో వరద జలాలను ఎత్తిపోయాలని అధికారులు భావిస్తున్నారు.

కేఎల్ఐ ఆయకట్టు	రిజర్వాయర్లు	ప్రస్తుతం నీటినిల్వ సామర్థ్యం
4,24,816 ఎకరాలు	4 (ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు)	4 టీఎంసీలు

మిషన్ భగీరథకు పంపింగ్

మిషన్ భగీరథ తాగునీటి స్కీంకు కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారానే కృష్ణానీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి వారంలో ఒకటి లేదా రెండుమార్లు నీటి పంపింగ్ జరుగుతోంది. దీని కారణంగానే కేఎల్ఐ పంప్‌హౌజ్‌లో మోటార్ల మరమ్మతు పూర్తి చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని అధికారులు చెబుతున్నారు. మోటార్ల మరమ్మతు పూర్తిచేయాలంటే రెండు నెలల పాటు పూర్తిగా నీటి పంపింగ్ ఆపేయాలని, సర్జిపూల్‌లోకి నది నీళ్లు చేరకుండా అప్రోచ్ చానల్‌కు అడ్డుకట్ట వేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మోటార్ల మరమ్మతు నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు.



కేఎల్ఐ పంప్‌హౌజ్

260 అడుగులకు చేరితే..

కృష్ణానదికి వరద వస్తే ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎల్లూరు పంప్‌హౌజ్‌లో రెండు మోటార్లు రిపేరులో ఉన్నాయి. వాటికి చేపట్టిన మరమ్మతు పనులను ప్రస్తుతానికి నిలిపివేశాం. మూడు మోటార్లతోనే ఈ ఏడాది ఎత్తిపోతలు కొనసాగుతాయి. ఎల్లూరు జలాశయాన్ని ముందుగా నింపి, అక్కడి నుంచి సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లకు తరలిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం నీటి ఎత్తిపోతలకు అవసరమైన చర్యలు చేపట్టాం. ప్రస్తుతం నదిలో 245 మీటర్ల ఎత్తులో నీళ్లున్నాయి. 260 అడుగులకు చేరిన వెంటనే ఎత్తిపోతలు ప్రారంభమవుతాయి.

– లోకిలాల్‌నాయక్, డీఈ, ఎల్లూరు పంప్‌హౌజ్ పర్యవేక్షకుడు

అన్నదాతకు ఆపన్నహస్తం 'రైతుబీమా'



రైతు కుటుంబానికి రూ.5 లక్షల బీమా ప్రొసీడింగ్ అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి/పెబ్బేరు రూరల్: మట్టిని నమ్ముకొని అందరికీ అన్నం పెడుతున్న అన్నదాతలను ఆపత్కాలంలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బీమా పథకం అమలు చేస్తున్నారని.. ఇది రైతులకు ఆపన్న హస్తంగా మారిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని శ్రీనివాసపురంలో ఇటీవల మృతిచెందిన రైతు రాములు కుటుంబానికి రైతు బీమా పథకంలో మంజూరైన రూ.5 లక్షల ప్రొసీడింగ్ ప్రతిని మంత్రి అందజేసి మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ఇలాంటి బీమా పథకాలు రైతులకు వర్తింపజేసిన దాఖలాలు నేటికీ లేవన్నారు. గతంలో రైతు మరణిస్తే.. ఆ కుటుంబాన్ని ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ఇంటి పెద్దదిక్కును కోల్పోయి ఆర్థిక సమస్యలతో సతమతమయ్యేవని గుర్తుచేశారు. ఒక్క గుంట భూమి ఉన్నా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రూ.5 లక్షల బీమా కల్పిస్తోందన్నారు.

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు వినతి..

జిల్లాకేంద్రంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయాలని వాల్మీకి సంఘం నాయకులు బీజేపీ నారాయణ, మండ్ల దేవన్న ఆదివారం క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రధాన కూడలితో పాటు రామాలయంలోనూ విగ్రహ ప్రతిష్ఠాపనలు చేయాలని కోరారు.

కార్యకర్తకు పరామర్శ..

మండలంలోని చందాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చిన్న రాములు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డి గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

గ్రూప్–2 పరీక్షల తేదీల్లో మార్పునకు వినతి..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ల తేదీలను దృష్టిలో ఉంచుకొని గ్రూప్–2 పరీక్షలు నిర్వహించే తేదీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని నిరుద్యోగ యువకులు ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి విషయాన్ని ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

పట్టణంలోని జమ్మిచెట్టు ఆటో యూనియన్ నాయకులు కొమ్ము శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని.. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారిని ఆదుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు దేవరకద్రలోని అన్నాసాగర్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎప్పుడు వచ్చేదో తెలిసేది కాదని.. బీఆర్ఎస్ పాలనలో దరఖాస్తు చేసుకున్న స్వల్ప వ్యవధిలోనే చెక్కు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్, గాడీల ప్రశాంత్, ఉమామహేశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

క్లూస్‌టీం ఎస్ఐని అభినందించిన డీజీపీ



డీజీపీ అంజనీకుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ రవిసాగర్

వనపర్తి: జిల్లాలోని ప్రధాన కేసులను ఛేదించడంలో సాంకేతిక పరిజ్ఞానంతో ఆధారాలు అందించిన క్లూస్‌టీం ఎస్ఐ రవిసాగర్‌ను డీజీపీ అంజనీకుమార్ ఆదివారం అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిసాగర్‌ను ఎస్పీ రక్షిత కె.మూర్తి, ఏఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి అభినందించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించిన వారికి గుర్తింపు లభిస్తుందనడానికి రవిసాగర్ ఉదాహరణ అని ప్రశంసలు గుప్పించారు.

నేడు బీజేపీ మహాధర్నా

వనపర్తిటౌన్: బీజేపీ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డా. ఎ.రాజవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 2014, 2018 ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని ఆశ చూపి నేటికీ కేవలం 20 వేల ఇళ్లు మాత్రమే నిర్మించారన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి రోడ్ల విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు కేటాయిస్తూ అర్హులైన పేదలకు గోస మిగిలిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలో రెండు లక్షల ఇళ్లకు సుమారు రూ.15 వేల కోట్లు మంజూరు చేస్తే సీఎం కేసీఆర్ సుపరిపాలనతో వాటిని పక్కదారి పట్టించి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, బి.కృష్ణ, నాయకులు శ్రీశైలం, బండారు కుమారస్వామి, సుమిత్రమ్మ, ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, పెద్దిరాజు, కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కేతేపల్లిలో 329 మంది బీసీ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కల నేటికీ నెరవేరిందన్నారు. అర్హత ఉండి ఇళ్ల పట్టాలు అందని వారికి న్యాయం చేస్తామని.. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉచిత విద్యుత్ వద్దన్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో రహదారి విస్తరణకు సహకరించాలని.. ఇళ్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. గ్రామంలోని సబ్‌సెంటర్‌ను పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తామని, మండల కేంద్రంగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామని త్వరలోనే ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని తెలిపారు. ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వీనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమనాథ్‌నాయక్, విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, సర్పంచ్ అనిత, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామల, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు రాముయాదవ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిక..

మండలంలోని తెల్లరాళ్లపల్లి సర్పంచ్ రేణమ్మతో పాటు మౌలాలి, తారకమ్మ, హోటల్ రాములు మరో 20 మంది మాజీ మంత్రి జూపల్లి వర్గీయులు ఆదివారం ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

క్లుప్తంగా

బ్రెయిన్ స్ట్రోక్‌తో బాలుడు మృతి


సుశాంత్ (ఫైల్)

అడ్డాకుల: బ్రెయిన్ స్ట్రోక్‌తో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వర్నె గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిట్టెమ్మ, సహదేవ్ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో రెండో కుమారుడు సుశాంత్(15) దేవరకద్ర మండలంలోని పేరూరు జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి వద్ద బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పిన గంటలోపే ప్రాణాలు వదిలాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నిన్నటి వరకు కుటుంబ సభ్యుల ముందు ఆడుతూ పాడుతూ గడిపిన బాలుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడం ఆ కుటుంబాన్ని తీరని శోకసంద్రంలో ముంచింది.

చికిత్స పొందుతూ వ్యక్తి..


జంగయ్య (ఫైల్)

నవాబుపేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మరికల్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మరికల్‌కు చెందిన జంగయ్య(36)టైలరింగ్ చేసేవాడు. సొంత పనిమీద జిల్లా కేంద్రానికి ఖాజాతో కలిసి శనివారం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నవాబుపేట సమీపంలో వెనక నుంచి వస్తున్న కారు వేగంగా వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న జంగయ్యకు, ఖాజాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే 108 లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జంగయ్య ఆదివారం మృతి చెందాడు. అయనకు భార్య శ్రీలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

రైలు కిందపడి చిన్నారి దుర్మరణం


శ్రీలక్ష్మి (ఫైల్)

మహమ్మదాబాద్: హైదరాబాద్‌లో బంధువుల దగ్గరికి వెళ్తుండగా రైలు దిగుతున్న సమయంలో కాలు జారి చిన్నారి రైలు కింద పడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లికి చెందిన పీ చంద్రారెడ్డికి ముగ్గురు కూతుళ్లు. మూడో కూతురు శ్రీలక్ష్మి (3) మహమ్మదాబాద్ ఎంజల్‌వ్యాలీ పాఠశాలలో నర్సరీ చదువుతోంది. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని చంద్రారెడ్డి అన్న ఇంటికి భార్యాభర్తలు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని బుద్వేల్‌కు రైల్లో వెళ్లారు. రైలు దిగుతున్న సమయంలో చిన్నారి శ్రీలక్ష్మి ప్రమాదవశాత్తు జారి ట్రెన్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. చిన్న కూతురు మృతి చెందడంతో వారి కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం గద్వాల పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం (38) కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. అతనికి సంబంధించిన బంధువులెవరైనా ఉంటే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ ఆత్మీయ అభిమాని మృతి


కుప్పిరెడ్డి వెంకట్రాం రెడ్డి (ఫైల్)

బిజినేపల్లి: మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆత్మీయ అభిమాని కుప్పిరెడ్డి వెంకట్రాంరెడ్డి(82) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొద్ది నెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కుచుకుళ్ల రాజేష్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాగర్‌కర్నూల్ పర్యటనల్లో, ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నప్పుడు వెంకట్రాంరెడ్డి ఇంటిలోనే బస చేసేవారు. ఆ అనుబంధంతో ఆయన భార్య జెడ్పీటీసీ సభ్యురాలుగా పని చేశారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ, మండల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఆయన సేవల్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు.

గుదిబండలా 'వాటర్ గ్రిడ్'

- అయిజలో ఇటీవల కుప్పకూలిన పైప్‌లైన్
- 86 గ్రామాలకు నిలిచిపోయిన తాగునీటి సరఫరా
- పునరుద్ధరించేందుకు అధికారుల మల్లగుల్లాలు
- త్వరగా పనులు పూర్తిచేయాలంటున్న ప్రజలు


పైపులైన్ పనులు పునరుద్ధరించేందుకు తెచ్చిన కొత్త పైపులు


పెద్దవాగుపై కుప్పకూలిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్

అయిజ: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేందుకు అయిజ పట్టణంలో పెద్దవాగుపై ఏర్పాటు చేసిన వాటర్‌గ్రిడ్ పైప్‌లైన్ ఇటీవల కుప్పకూలింది. దీంతో అలంపూర్ నియోజకవర్గంలోని మొత్తం 83 గ్రామాలు, 3 మున్సిపాలిటీల్లోని ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. రోజుల తరబడి మిషన్ భగీరథ నీరు అందక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రణాళిక లేని పనులు

ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూ.కోట్లు ఖర్చుపెడుతున్నా.. అధికారులు మాత్రం సరైన ప్రణాళిక చేయకపోవడంతో ఫలితం లేకుండా పోతుంది. చేసిన పనులను మళ్లీ చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో వాటర్‌గ్రిడ్ అధికారులు వాగుపక్కన పిల్లర్లు ఏర్పాటు చేసి వాటిపై వాటర్‌గ్రిడ్ పైపులను అమర్చారు. తాజాగా పట్టణంలో శిథిలమైన వంతెనను కూల్చి నూతనంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మించే పనులను చేపట్టారు. అయితే గతంలో నిర్మించిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ పక్కనే ఉండడంతో పైప్‌లైన్ ఒక్కసారిగా కుప్పకూలి గోతిలో పడిపోయింది. ఆర్అండ్‌బీ అధికారులకు, వాటర్ గ్రిడ్ అధికారులకు సమన్వయం లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ కూలిపోయింది.

ఆరు మండలాల్లో నీటి కటకట

వాటర్‌గ్రిడ్ పైప్‌లైన్ కూలిపోవడంతో అలంపూర్ నియోజకవర్గంలోని ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. అయిజ మున్సిపాలిటీతోపాటు మండలంలోని 17గ్రామాలు, వడ్డేపల్లి మున్సిపాలిటీతోపాటు మండలంలోని 6 గ్రామాలు, అలంపూర్ మున్సిపాలిటీతో మండలంలోని 15 గ్రామాలు, రాజోళి మండలంలో 16 గ్రామాలు, మానవపాడు మండలంలో 8 గ్రామాలు, ఉండవెల్లి మండలంలో 18 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఒకటి కాదు రెండు కాదు దాదాపు వారం రోజుల పాటు తాగునీరు సరఫరా కాని పరిస్థితితో ప్రజలు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు.

కొనసాగుతున్న పనులు

కుప్పకూలిన వాటర్‌గ్రిడ్ పనులను పునరుద్ధరించేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ పనులు చేసేందుకు దాదాపు రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుందని సమాచారం. ఆదివారం కొత్త పైపులను తెప్పించారు. అయితే గుంతలో పడిపోయిన పాత పైపులను తొలగించి వాటి స్థానంలో పిల్లర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. పిల్లర్ల పనులు పూర్తి చేసేందుకు నాలుగురోజులు, కొత్త పైపులను అమర్చేందుకు మరో రోజు చొప్పున పనులు చేపట్టినా 5రోజుల సమయం పడుతుంది. మొత్తంగా వారం రోజులపాటు 86 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా చేసే పరిస్థితి లేదు.

నీటి కోసం పాట్లు..


ఉండవెల్లిలో బోర్‌ద్వారా నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ఉండవెల్లి: అయిజలో వాటర్‌గ్రిడ్ పైపులైన్ కుప్పకూలడంతో మండలంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటి కటకట నెలకొంది. చేసేది లేక ప్రజలు బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇన్నాళ్లు వృథాగా ఉన్న బోర్లను మరమ్మతు చేయించి వాటి ద్వారా నీరందించేందుకు సర్పంచులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ట్యాంకుల ద్వారా నీటిని అందిస్తున్నారు.

వారంలో నీటి సరఫరా పునరుద్ధరిస్తాం



వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ కూలిపోయిన ప్రదేశంలో పిల్లర్లు ఏర్పాటు చేసి వాటిపై పైప్‌లైన్ నిర్మిస్తాం. పనులు పూర్తిచేసేందుకు సమయం పడుతుంది. పైప్‌లైన్ పునరుద్ధరించే ప్రదేశంలో బ్రిడ్జి పనులు చేపట్టారు. లోతైన గుంతను తవ్వడంతో పైప్‌లైన్ నిర్మాణం కష్టతరంగా మారింది. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. – నాగరాజు, వాటర్ గ్రిడ్, డిప్యూటీ ఈఈ

ట్యాంకర్ల ద్వారా నీరందించాలి



వాటర్ గ్రిడ్ పైపులు కొత్తవి ఏర్పాటు చేసేందుకు వారం రోజుల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. అంతవరకు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరందించాలి. మున్సిపాలిటీలో ఒక్కొక్క వార్డుకు ఒక ట్యాంక్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – బాషా, అయిజ

రక్షణ గోడ నిర్మించాలి



ఇప్పుడైనా వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ పనులు పటిష్టంగా చేపట్టాలి. భవిష్యత్తులో మళ్లీ సమస్య తలెత్తకుండా చూడాలి. పైప్‌లైన్‌లను అమర్చే ప్రదేశంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు. పిల్లర్లు ఏర్పాటుచేసి ఆ ప్రదేశంలో రక్షణగోడ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – యువతేజేశ్వర్‌రెడ్డి, గుడుదొడ్డి

పనులు త్వరగా పూర్తిచేయాలి



పైప్‌లైన్ కూలిపోయి ఇప్పటికే మూడు రోజులవుతుంది. అప్పటి నుంచి తాగునీటి సమస్య తీవ్రమైంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి. – తిరుమలేష్, అయిజ

రంగస్థల నాటకాలు కాపాడాలి


నాటక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పెబ్బేరు: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో శ్రీసరస్వతి కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా కళాకారుల పోటీ ప్రదర్శనలను మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ, సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్లు రావడంతో రంగస్థలం, నాటకాలు, కళావేదికలు అంతరిస్తున్నాయన్నారు. అప్పట్లో కళాకారులు గ్రామాల్లో నాటకాల ద్వారా ప్రజలను చైతన్య చేసేవారని, తర్వాత అవి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. భావితరాల కోసం చిన్నారులతో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు తదితర నాటకాలు వేయించడంతో పాటు రంగస్థలంలో కళావేదికలు పునర్‌ప్రారంభించేందుకు అందరం కృషి చేయాలని కోరారు. 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఈ పోటీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నృత్య, పౌరాణికం, జానపద నాటక ఏకాంకిక ప్రదర్శనల్లో విజేతలకు నగదుతోపాటు షీల్డు, ప్రశంసాపత్రం ప్రముఖుల ద్వారా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, శ్రీసర్వసతి కళాసమితి అధ్యక్షుడు సర్వారెడ్డి, గౌరవ అధ్యక్షుడు గౌని బుచ్చారెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వర్, సీతార వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కళాకారులు పాల్గొన్నారు.

900 కిలోల నల్లబెల్లం పట్టివేత



అచ్చంపేట రూరల్: మండలంలోని శివారు తండాలో ఆదివారం 30 బస్తాల్లో 900 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పటికను పట్టుకున్నట్లు అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐలు బాలరాజు, సతీష్‌కుమార్‌లు తెలిపారు. నిషేధిత నల్లబెల్లం అమ్మినా, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శివారుతండాలోని దీప్లా ఇంటి వద్ద దాడులు నిర్వహించి, ఇంట్లో నిల్వ ఉన్న నల్లబెల్లం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీప్లాపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట సిబ్బంది నవీన్, ఆసిఫ్ ఉన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద


వరద నీటితో కళకళలాడుతున్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

- ఆలమట్టికి లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో
- జలవిద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట/దేవరకద్ర/మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. ఆదివారం రాత్రి 9 గంటలకు 31,200వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరద వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657టీఎంసీలు కాగా... ప్రస్తుతం 8.551 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా విద్యుదుత్పత్తి కోసం 37,434 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు పంపులను ప్రారంభించి 1500 క్యూసెక్కులను ఎత్తిపోస్తున్నారు. అలాగే ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2 ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1 ద్వారా 1,300 క్యూసెక్కులు, మొత్తం ప్రాజెక్టు నుంచి 41,973 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


దిగువజూరాల పవర్‌హౌజ్ కేంద్రంలోకి చేరుతున్న వరదనీరు

■ ఎగువన ఉన్న ఆలమట్టి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 54.56 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1.07, 769 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 6,671 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం17.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీనికి 5,081 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి 50 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

■ జూరాల ఎగువ దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఆదివారం రాత్రి వరకు తొమ్మిది యూనిట్ల ద్వారా 320 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో ఐదు యూనిట్ల ద్వారా175 మెగావాట్లు, దిగువలో నాలుగు యూనిట్ల ద్వారా 145 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. రాత్రి వరద తగ్గడంతో ఎగువ విద్యుత్ కేంద్రంలోని మూడు యూనిట్లను నిలిపివేశారు.

■ శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు 809.1అడుగుల నీటి మట్టం, 33.7658 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల నుంచి 37,930 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885.0 అడుగులు, నీటి సామర్థ్యం 215.8070 టీఎంసీలుగా ఉంది.

■ కోయిల్‌సాగర్‌లో ఆదివారం సాయంత్రం 7 గంటలకు నీటిమట్టం 21 అడుగులకు చేరింది. మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులకు 1,020అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటిని నిలిపివేశారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలిపారు.

సందర్శకుల తాకిడి


జూరాల ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సందర్శకులు భారీగా ప్రజలు తరలి వచ్చారు. శనివారం జూరాలకు భారీగా వరద నీరు వస్తోందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు రావడంతో ఆదివారం జూరాలకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఎగువ నుంచి వస్తున్న నీటిని కేవలం జల విద్యుత్ ఉత్పత్తి కోసం ఇరిగేషన్ శాఖ అధికారులు విడుదల చేస్తున్నారు. గేట్లు ఎత్తకపోవంతో సందర్శకులు నిరాశతో వెనుదిరిగారు. మరి కొందరు ముఖ ద్వారాలు, వ్యూ పాయింట్ల వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.

వరల్డ్ యూనివర్సిటీ పోటీలకు అనన్యశ్రీ

- ఆలిండియా యూనివర్సిటీ వాలీబాల్ జట్టులో చోటు
- 28 నుంచి చైనాలో చాంపియన్‌షిప్ ప్రారంభం


సీనియర్ నేషనల్ విన్నర్ ట్రోఫీతో అనన్యశ్రీ

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్‌లో విశేష ప్రతిభ కనబరుస్తుంది. 2019లో ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా అథ్లెట్ పథకం కింద కేరళలోని పట్టణమిట్టలోగల వాలీబాల్ అకాడమీకి ఎంపికై శిక్షణ తీసుకుంటుంది. ఈమె తెలంగాణతో పాటు కేరళ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. తెలంగాణ నుంచి 2018 పంజాబ్‌లో జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. 2019లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి, 2020 కడపలో జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళ రాష్ట్రం తరపున గతేడాది ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్‌లో 23వ జాతీయస్థాయి, మహారాష్ట్ర సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌లో 24వ జాతీయస్థాయి యూత్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, మహారాష్ట్ర రాష్ట్రం కొల్హాపూర్‌లో సీనియర్ లీగ్ (హరియంట్ చసాక్) వాలీబాల్ టోర్నీలో పాల్గొంది. ఈ మూడు టోర్నీల్లో కేరళ జట్టు విన్నర్‌గా నిలిచింది. అస్సాం రాష్ట్రం గౌవహాటిలో ఈ ఏడాది ఫిబవరిలో 71వ ఉమెన్ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు కేరళ రాష్ట్ర జట్టుకు అనన్యశ్రీ ప్రాతినిధ్యం వహించింది. సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కేరళ మహిళా జట్టు విజేతగా నిలవడంతో అనన్యశ్రీ బంగారు పతకం సాధించింది. పాండిచ్చేరిలో ఫెడరేషన్ కప్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనగా కేరళ రాష్ట్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది.

వరల్డ్ యూనివర్సిటీ పోటీలకు..

అనన్యశ్రీ తొలిసారిగా విదేశీగడ్డపై వాలీబాల్ పోటీల్లో పాల్గొననుంది. చైనా దేశం చెంగ్డ్ నగరంలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు నిర్వహించే ×వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌కి కు ఎంపికైంది. కేరళ యూనివర్సిటీ నుంచి చైనాకు వెళ్లే ఆలిండియా యూనివర్సిటీ వాలీబాల్ జట్టులో అనన్యశ్రీ చోటు దక్కించుకుంది. ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈనెల 19 నుంచి 24 వరకు నిర్వహించిన ప్రత్యేక కోచింగ్ క్యాంపులో పాల్గొంది.

పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిద్దాం

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- గ్రీన్‌బెల్ట్‌లో విగ్రహావిష్కరణ


పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బహుజన వీరుడు పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిద్దామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో త్వరలోనే రూ.3కోట్లతో ముదిరాజ్ భవన నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. పండుగ సాయన్న ఒక ముదిరాజ్ కులానికే పరిమితం కాదని, ఆనాటి బహుజనులలో ఉన్న పేదల కోసం పోరాటం చేశారన్నారు. గడులను కొల్లగొట్టి పేదవారికి పంచిపెట్టాడని అన్నారు. దేశంలో బహుజనులకు అధికారం రావాలని, రిజర్వేషన్లు కావాలని గతంలో ఎంతో మంది కృషి చేశారన్నారు. మహనీయుని చరిత్రను ఇప్పటివరకు తొక్కిపెట్టారని, అయినప్పటికీ ఆయన చరిత్ర ఈరోజు జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తెలుస్తుందని తెలిపారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ పండుగ సాయన్న బహుజనులందరికీ ఆదర్శమని తెలిపారు. ఆయన కులం కోసం కాకుండా సమాజంలోని ఆకలితో ఉన్న వారి కోసం పనిచేశారని అన్నారు. తెలంగాణ రాబిన్ హూడ్‌గా చరిత్రకు ఎక్కారని అన్నారు. పండుగ సాయన్న విగ్రహాన్ని షాద్‌నగర్, మహబూబ్‌నగర్, నవాబుపేట, రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గంలో సైతం పెట్టబోతున్నట్లు తెలిపారు. పండుగ సాయన్న వారసులు పండుగ యాదయ్య, నర్సింహులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్ కిశోర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌మాల రోడ్డుపై ఆలయ హుండీ



అయిజ/గట్టు: గట్టులోని భవాని మాత అమ్మవారి హుండీ ఆదివారం అయిజ మండలం వెంకటాపురం సమీపంలోని భారత్‌మాల రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తులు పడేసిపోయారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు గట్టు పోలీసుల సహకారంతో వెంకటాపురం వెళ్లి హుండీని పరిశీలించారు. ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలను విరగొట్టి హుండీని ఎత్తికెళ్లిన విషయం తెలిసిందే. చోరీకి గురైన హుండీగా గుర్తించి, అయిజ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ తర్వాత హుండీని గట్టు పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి అప్పగించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హుండీలోని డబ్బులను దొంగిలించి, కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టిన చోట పడేసి వెళ్లారు.

ఆలయంలో చోరీ


పెద్దకడ్మూర్ ఆంజనేయస్వామి ఆలయంలో చోరీపై విచారణ చేస్తున్న పోలీసులు

నర్వ: ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ చేసిన ఘటన మండలంలోని పెద్దకడ్మూర్‌లో చోటు చేసుకుంది. అర్చకుడు ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లగా, అప్పటికే గుడి తాళం విరగ్గొట్టి ఉంది. గర్భగుడిలోని స్వామి వారి విగ్రహంపైన ఉన్న వెండి నామాలు, కళ్లు, మీసాలు, ద్వాదశ నామాలు, రూ.3వేల నగదును దుండగులు చోరీ చేశారు. ఈ ఘటనపై నర్వ పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఆలయానికి వచ్చి చోరీపై ఆరా తీశారు. దుండగులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.